చెస్ క్రీడాకారిణిని అభినందించిన కలెక్టర్


బాలిక శివాంశికను అభినందిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక

అత్తాపూర్: చదరంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు జాతీయ పురస్కారాలు పొందిన చెస్ క్రీడాకారిణి శివాంశికకి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అండగా నిలిచారు. ఈ నెలాఖరులో ఉదయ్‌పూర్‌లో జరగనున్న జాతీయ చెస్ పోటీల్లో పాల్గొనడానికి తగిన ఆర్థిక సాయాన్ని అందించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక హామీ ఇచ్చారు. ఉదయ్‌పూర్‌లో నెలాఖరులో జరగనున్న జాతీయ చెస్ పోటీల్లో శివాంశిక పాల్గొనుంది. అలాగే మరో నాలుగు జాతీయ పోటీల్లో పాల్గొనాల్సి ఉండగా ప్రభుత్వం సాయం అందించే ప్రయత్నం చేస్తామని కలెక్టర్ చెప్పారని బాలిక తల్లి భవానీ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఈ బాలికది పేద కుటుంబం .తండ్రి క్యాబ్ డ్రైవర్. కాగా బాలిక చెస్ నైపుణ్యాన్ని గ్రహించిన తల్లిదండ్రులు శిక్షణ నిమిత్తం హైదరాబాద్ నగరానికి వచ్చి అత్తాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతిలో చేర్పించారు. శిక్షణ పొందుతూ జాతీయ స్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలవడంతో మండల విద్యాధికారి రామ్‌రెడ్డి తన శక్తి మేరకు ఎంతో ప్రోత్సహించారు. తాజాగా కలెక్టర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్, జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, అత్తాపూర్ స్కూల్ పీఈటీ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి


సెమినార్‌లో పాల్గొన్న డీఆర్‌డీఓ సైంటిస్ట్ డా.దెబాషిస్ చక్రవర్తి, విద్యార్థులు

అత్తాపూర్: విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంతో పాటు అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. శనివారం మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మహావీర్ కళాశాలలో హైపర్ సోనిక్ మిస్సైల్ టెక్నాలజీ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీఓ సైంటిస్ట్ డాక్టర్ దెబాషిస్ చక్రవర్తి, కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారతదేశం రాకెట్ ప్రయోగాలలో అత్యున్నత స్థాయి మిస్సైల్ టెక్నాలజీ కలిగి ఉందన్నారు. మెకానికల్ విద్యార్థులు టెక్నాలజీలను ఉపయోగించి యుద్ధ ట్యాంక్‌లను మిస్సైల్ ఉత్పత్తికి కృషి చేసి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. మహావీర్ కళాశాల చేస్తున్న కృషి అభినందనీయమని దెబాసిస్ చక్రవర్తి అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, ఐఏసీ కో ఆర్డినేటర్ వి.ఎస్.ప్రతిభ, డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, హెచ్‌ఓడీ మెకానికల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన బుద్వేల్ గ్రామ కమిటీ ఎన్నిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నూతన బుద్వేల్ గ్రామ శాఖను ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కస్తూరి నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు కోరని బాల్‌రాజ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోరని శ్యామ్, ఉపాధ్యక్షులుగా ఎ.నవీన్‌కుమార్, డి.కిరణ్‌కుమార్ యాదవ్, ఈగ రమేశ్, జనరల్ సెక్రటరీగా కె.వినోదచారి, కార్యదర్శిగా కె.ధన్‌రాజ్, సంయుక్త కార్యదర్శిగా ఎం.ఆంజనేయులు, కోశాధికారిగా కోరని నరేందర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జి.చందు, కార్యదర్శిగా ఎండీ సమీర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె.నాగరాజు, పెండ్యాల శ్రీధర్, సిహెచ్.అమర్‌నాథ్, సంతప్ కుమార్, బక్షవరి కుమార్, ఇ.రాజు, ఎ.రాజేందర్‌కుమార్, కె.పాండు మంద హరికుమార్, ప్రకాశ్, పి.బాల్‌రెడ్డి, జె.యాదగిరిలను ఎన్నుకున్నారు.

ఎరువులు తగిన మోతాదులో వాడాలి

వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు


సుల్తాన్‌పల్లిలో రైతులకు పనిముట్లు అందజేసిన శాస్త్రవేత్తలు

శంషాబాద్ రూరల్: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించి, తగిన మోతాదులోనే పంటలకు ఎరువులు వాడాలని శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని సుల్తాన్‌పల్లిలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ రైతులకు స్ప్రేయర్లు, టార్పాలిన్ కవర్లను పంపిణీ చేశారు. రైతులకు అన్ని విధాలుగా సహకారం అందజేస్తామని ఈ సందర్భంగా ఎంపీటీసీ సంగీత సిద్దేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ.మాధవి, డాక్టర్ కె.పవన్‌చంద్రారెడ్డి, రైతులు లక్ష్మయ్య, హంసమ్మ, దర్శన్, యాదయ్య, ఈశ్వరయ్య, మారుతి, ఆగిరెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివి

గోల్కొండ: ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివని గోల్కొండ ఏరియాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. ఆసుపత్రిలో ఆశా వర్కర్లు, ఇతర సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, అదేవిధంగా ప్రజల ఆరోగ్యం , గర్భిణుల వివరాలను ప్రభుత్వానికి అందించడంలో అధికారులు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటారని పేర్కొన్నారు. వీరికి తోడుగా ఏఎన్‌ఎంలు ఉంటూ సలహాలు, సూచనలు అందిస్తారన్నారు.

పరిశోధనలు సమాజానికి మేలు చేయాలి


ప్యానల్ డిస్కషన్‌లో పాల్గొన్న అతిథులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొ.పీజే నారాయణన్

- ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొ.పీజే నారాయణన్
- ట్రిపుల్ఐటీ ఆర్ అండ్ డీ షోకేస్ అదుర్స్
- 28 పరిశోధనా కేంద్రాల నుంచి 300కిపైగా పోస్టర్లు, డెమోలు, నమూనాల ప్రదర్శన


డీ షోకేస్‌లో రాజస్థాన్ ఇళ్ల నమూనాలు

రాయదుర్గం: నూతన ఆవిష్కరణలు.. రకరకాల పోస్టర్లు... ఆయా అంశాలపై ఆలోచింపచేసేలా ప్రదర్శన సాగింది. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో రెండు రోజులపాటు సాగే వార్షిక ఆర్ అండ్ డీ షోకేస్‌ను శనివారం ప్రారంభించారు. ట్రిపుల్ ఐటీలోని 28 పరిశోధనా కేంద్రాల నుంచి 300కి పైగా పోస్టర్లు, డెమోలు, నమూనాలను ఇందులో ప్రదర్శించడం విశేషం. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో బాధ్యతాయుతమైన ఏఐ, రీథింకింగ్‌పై రౌండ్ టేబుల్ చర్చలు, పరిశోధనా రిఫ్లెక్షన్‌లు, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఐఈ) ద్వారా పరిశోధనా స్టార్టప్‌లను కూడా షోకేస్‌లో ప్రదర్శించారు. ఈ షోకేస్‌లో అడ్వాన్స్ మల్టీ మోడల్ రీసెర్చ్ వెహికిల్, మల్టీ సెన్సార్ బైక్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఇండియన్ టు వీలర్ డ్రైవింగ్ డేటా సెట్ వాహనం ప్రదర్శనలో, సిస్మోగ్రాఫ్ డిస్‌ప్లే, ప్రత్యేకంగా రూపొందించిన డ్రోన్, రాజస్థాన్ ఇళ్ల నమూనాలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. సమాజానికి మేలు చేసేలా అధ్యాపకులు, విద్యార్థుల పరిశోధనలు ఉంటాయని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా 'రైట్ టు నో యువర్ అల్గారిథమ్'లపై చర్చా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉషా రామనాథన్, సెంటర్ ఫర్ ఇంటర్‌నెట్ అండ్ సొసైటీ బెంగళూరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తన్వీర్ హసన్, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా ప్రొఫెసర్ కృష్ణ, శ్రీనివాస్, పాల్గొన్నారు. అనంతరం టెక్ బదిలీ కార్యాలయంలో సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పేటెంట్ గ్రహీతలను సత్కరించారు.

లింగంపల్లి టు ఘట్‌కేసర్

విస్తరిస్తున్న ఎంఎంటీఎస్ రైలు సౌకర్యం



శేరిలింగంపల్లి: ఎంఎంటీఎస్ (మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సర్వీస్) రైలు సౌకర్యం మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. ఇప్పటికే సికింద్రాబాద్, నాంపల్లి, ఫలక్‌నామా వరకు ఎంఎంటీఎస్ రైలును పొడిగించగా ..తాజాగా ఘట్‌కేసర్ వరకు విస్తరించడంతో ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలిగింది.

ఘట్‌కేసర్‌కు ఎంఎంటీఎస్ సౌకర్యం

- లింగంపల్లి నుంచి ఘట్‌కేసర్‌కు ఎంఎటీఎస్ రైలు సౌకర్యం విస్తరించడంతో 123.52 కిలోమీటర్లకు పెరిగింది.
- ఈ కొత్త రైలు ఘట్‌కేసర్, చర్లపల్లి, మల్లాపూర్, నేరేడ్‌మెట్, సుచిత్రా, భూదేవినగర్ వంటి ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగుతాయి.
- మొదటి రైలు ఘట్‌కేసర్‌లో ఉదయం 7.20 గంటలకు ప్రారంభమై లింగంపల్లికి 9.15 గంటలకు చేరుకుంటుంది.
- చివరి రైలు లింగంపల్లిలో సాయంత్రం 5.45 ఆరంభమై ఘట్‌కేసర్‌కు రాత్రి 7.30 గంటలకు చేరుకుంటుంది. ఈ రైల్లో పీర్జాదిగూడ, సుచిత్రా సెంటర్, భూదేవినగర్, అమ్ముగూడ, నేరేడ్‌మెట్, మౌలాలి హౌసింగ్‌బోర్డు హైలెవల్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

యాదగిరిగుట్టకు వెళ్లే వారికి మేలు

- లింగంపల్లి, పరిసర ప్రాంతాల నుంచి యాదగిరిగుట్టకు వెళ్లాలంటే బస్సులో రాకపోకలు ఉంటాయి. ఎక్కు శాతం బస్సులపైనే ఆధారపడాల్సి వస్తోంది.
- ఈ నేపథ్యంలో ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్ రైలు సౌకర్యం ఉండడంతో అక్కడి వరకు వెళ్లి తర్వాత ప్రైవేటు వాహనాల్లో భువనగిరి మీదుగా యాదగిరిగుట్టకు వెళ్లవచ్చు.



నాంపల్లి, ఫలక్‌నామా, మేడ్చల్‌కు ..

- లింగంపల్లి నుంచి ఇప్పటికే నాంపల్లి, ఫలక్‌నామా, మేడ్చల్ వరకు వెళ్లొచ్చు
- ప్రయాణికులకు సౌకర్యంతో బాటు తక్కువ చార్జీ ఉండడంతో ఎంఎంటీఎస్‌లలో రద్దీ పెరిగిపోతోంది.
- ట్రాఫిక్ రద్దీ నుంచి ప్రయాణికులకు విముక్తి కలిగించేందుకు ఎంఎంటీఎస్ ఉపయుక్తంగా మారింది.
- ఇక కొత్తగా పలు ప్రాంతాలకు ఎంఎంటీఎస్ సేవలను విస్తరించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం లేకపోలేదు. లింగంపల్లి ఎంఎంటీఎస్ స్టేషన్ వైపు మరిన్ని సౌకర్యాలను కూడా మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

నేడు ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సమావేశం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10గంటలకు సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. ఇంటి పన్ను, నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, వార్డు కమిటీ సమావేశాల గురించి చర్చిస్తామన్నారు. సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మికి బెస్ట్ టీచర్ అవార్డు



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యాదవమిత్ర కాలనీకి చెందిన అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మికి బెస్ట్ టీచర్ అవార్డు దక్కింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమెను ఘనంగా సత్కరించి అవార్డు ప్రదానం చేశారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు సన్మానం



రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని శనివారం రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు.

తరావీ ప్రార్థనలతో మానసిక ప్రశాంతత

గోల్కొండ: తరావీ ప్రార్థనలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ ముస్లిం మత గురువు జనాబ్ సయ్యద్ హౌలియా హుసేనీ సాబ్ ముర్తుజా బాద్‌షా ఖాద్రీ అన్నారు. గోల్కొండ సాలేనగర్‌లోని రోజ్ ఫంక్షన్‌హాల్‌లో తరావీ ప్రార్థనల ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. దివ్యాంగుడైన కూడా తరావీ ప్రార్థనలు ఆచరిస్తున్న జాహేద్ ఆలీని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు వజీఉజ్‌జమా సిద్ధిఖీ, అజీజ్‌ఖాన్ పఠాన్, హబీబ్ చౌష్ తదితరులు ఉన్నారు.

పేదలకు ఆహారం అందజేత



రాజేంద్రనగర్: పేదలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజలూ ముందుకు రావాలని శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెంద్యాల సాయి మల్లిక్ అన్నారు. శుక్రవారం రాత్రి శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో డైరీఫామ్, నీలోఫర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో రోడ్డుపై ఉన్న పేద ప్రజలకు ఆహార పొట్లాలను అందజేశారు.

వీడ్కోలు సమావేశం


విద్యార్థులకు హాల్ టికెట్‌లను అందజేస్తున్న దృశ్యం

మణికొండ: విద్యార్థులు పదవ తరగతి పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయాలని మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు హాల్ టికెట్‌లను పంపిణీ చే శారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, నాయకలు భరత్‌రెడ్డి, యాదయ్య, కుమార్, వీఫర్‌యు సహయోగ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు లక్ష్మణ్‌రావు, దిలిప్‌కక్కడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి


కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం ఇస్తున్న పద్మశ్రీ కాలనీవాసులు

బండ్లగూడ: మంచినీటి సమస్యతో సతమతమవుతున్నామని వెంటనే పరిష్కరించాలని కోరుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పద్మశ్రీ కాలనీవాసులు కమిషనర్ బి.శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి నీరు అందించాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి జలమండలి అధికారులతో సమన్వయం చేసుకోని సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు అమరేందర్‌రెడ్డి, ప్రదీప్, ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే ధైర్యం చాలా అవసరం

ఉమెన్ సేఫ్టీ వింగ్ పోలీస్ అధికారి రీమా రాజేశ్వరి

హఫీజ్‌పేట్: ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి ధైర్యం చాలా అవసరమని ఉమెన్ సేఫ్టీవింగ్ పోలీస్ అధికారి రీమా రాజేశ్వరి పేర్కొన్నారు. శనివారం చందానగర్ గంగారంలోని మహిళా దక్షిత సమితి, మహిళ దక్షిత సమితి విద్యా సంస్థలు, సుమన్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ రీమ రాజేశ్వరి, టెక్నికల్ డైరెక్టర్, శ్రీ సిమెంట్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఉమా గోర్క, మహిళా దక్షిత సమితి విద్యా సంస్థల ట్రస్టీ సభ్యులు సౌరబ్ కొఠారి, మహిళా దక్షిత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్‌లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ధైర్యంతో పాటుగా ఆత్మరక్షణ చాలా అవసరమన్నారు.

ఆకట్టుకున్న మోహినీయట్టం

మాదాపూర్: కళాకారులు భరతనాట్యం, మోహినియట్టం ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం కోల్‌కత్తాకు చెందిన భరతనాట్య కళాకారుడు కరుణ కేతన్ శంకర శ్రీగిరి, రామచంద్ర భజన, దేశ్ తిల్లాన అంశాలను ప్రదర్శించి అలరించారు. నిత్య శిష్యబృందంచే మోహినీయట్టం, భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో రంగపూజ, గణేశకౌతం, భాగ్యదా లక్ష్మీ, మోహినియట్ట వర్ణం, మూషికవాహన, శబ్దం, కీర్తనం తదితర అంశాలను కళాకారులు నిత్య, శాన్వి, కృష, వామిక, వలిక, రిషిక, అలీన, సహస్ర తదితరులు ప్రదర్శించారు.



ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం చిత్రప్రదర్శనలను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డా.లక్ష్మి కళాకారులతో కలసి ప్రారంభించారు. కళాకారుడు యు.విజయ్‌కుమార్ వేసిన చిత్రాలను ట్రాన్సెన్‌డెంటల్ రియాలిటీ పేరిట ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో దాదాపు 55 చిత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.


ఆకట్టుకుంటున్న స్పందన్

కళాకారులు శ్రీనివాస్, శ్వేత వేసిన చిత్రాలను స్పందన్ పేరిట ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డా.,లక్ష్మి ప్రారంభించారు. ఈ ప్రదర్శన రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాలార్‌జంగ్ మ్యూజియం మాజీ డైరెక్టర్ ఎ.నాగేందర్ రెడ్డి, కళాకారులు అంజుపొద్దార్, రచయిత రత్నారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం తొలగించాలని వినతి

బండ్లగూడ: రోడ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని నరేందర్‌బాబు కోరారు. ఈ మేరకు శనివారం ఆ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అభ్యుదయానగర్ కాలనీ మెయిన్ రోడ్డు మధ్యలో ఓ స్తంభం ఉందన్నారు. రాత్రి సమయంలో వాహనాదారులు గమనించకుండా వచ్చి స్తంభాన్ని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ విషయమై అధికారులకు విన్నవించగా స్తంభాన్ని వేరేచోట ఏర్పాటు చేస్తామని వారు హామీనిచ్చారని ఆయన తెలిపారు.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి


ఆస్తిపన్ను వసూలు కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్, దర్గాఖలీజ్‌ఖాన్, ప్రశాంత్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం ఇంటింటికీ తిరుగుతూ ఆస్తి పన్ను వసూళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ వందశాతం పన్ను వసూలు చేయాలన్నారు. ప్రజలు కూడా సహకరించి ఆయన కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీలో ఎమ్మెల్యే పర్యటన


న్యూగ్రీన్ సిటీ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని న్యూగ్రీన్ సిటీ కాలనీలో శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కమిటీహాల్‌తో పాటు కాలనీ ముఖ ద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... న్యూ గ్రీన్ సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులంతా కలిసి కాలనీ అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేశ్, ప్రగడంపల్లి శ్రావణ్, సాయిమణితో పాటు సొసైటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభించిన వాసవీ కపుల్స్ క్లబ్ సభ్యులు

మణికొండ: ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వర్తించటంతో మణికొండ వాసవీ క్లబ్ కపుల్స్ సంస్థ ముందుంటుందని అధ్యక్షుడు వి.వంశీకృష్ణ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం మణికొండ క్వార్టర్స్ లేబర్ అడ్డా వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మొదటి రోజు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లోను మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి తల్లాడ యశ్వంత్, కోశాధికారి శిరీష, జోన్ చైర్మెన్ కె.నిరీష, రీజియన్ చైర్మెన్ జి.నవీన్‌కుమార్, కార్యదర్శి రాం సురేష్, జిల్లా ఇంచార్జి కిరణ్‌కుమార్, దాతలు అభినందన కన్‌స్ట్రక్షన్ ఎండీ వెంకటేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికం


పట్టణంలో ఆందోళనకు దిగిన బీఆర్‌ఎస్ నేతలు

శంషాబాద్: సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఎమ్మెల్సీ కవితను కుట్రపూరితంగా అరెస్ట్ చేశారని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. అరెస్ట్‌కు నిరసగా శనివారం ఉదయం బీఆర్‌ఎస్ నేతలు పట్టణంలోని జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్,ఎంపీపీ జయమ్మ, , బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు డి. వెంకటేష్‌గౌడ్, నీరటి రాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై ప్రజలకు అవగాహన

గోల్కొండ: గ్లకోమాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మెహిదీపట్నంలోని సరోజినిదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.రాజలింగం అన్నారు. ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లకోమా వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. గ్లకోమా సైలెంట్ కిల్లర్ లాంటిదని ఎలాంటి లక్షణాలు లేకుండానే కంటి చూపును శాశ్వతంగా దెబ్బతీసే వ్యాధి అని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ నియమించాలి

గోల్కొండ: గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులను నియమించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తన బయోడేటాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల నియామకంలో పార్టీలోని సీనియర్లే కాకుండా కోసం పని చేసిన ఇతరులకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరామన్నారు. ఈ విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎం.రఘుపాల్‌రెడ్డి, శ్రీరాములు, పరమానందం, శ్రీకాంత్ ఉన్నారు.

ముగిసిన హస్తకళా ఉత్సవ్

మాదాపూర్: మాదాపూర్‌లోని నిఫ్ట్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన హస్తకళా ఉత్సవ్ శనివారంతో ముగిసింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన చేనేత, హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు కొనుగోలు చేశారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు లైవ్ డెమాన్‌స్ట్రేషన్, వర్క్‌షాప్‌లను నిర్వహించారు. కళాకారులకు నగర మార్కెట్‌పై అవగాహన కల్పించారు. మోడల్స్ చేనేత వస్త్రాలను ధరించి ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేశారు. చెక్క, వెండి, వెదురు, రాగి, అద్దాలు, పూసలతో తయారు చేసిన ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.